ఇల్లాలు

ముంగర శంకరరాజు

పట్టణం నడిబొడ్డులో క్రిక్కిరిసిన ఇండ్ల మధ్య వుంది ఆ యిల్లు. అది సత్రం లాంటి యిల్లు. అందరూ దాన్ని 'చాకమ్మ దేవిడీ' అంటారు. ఈ వూరిలో అద్దె కొంప కావలసినవారు చాకమ్మదేవిడీని తడిమితే చేటంత చోటు దొరక్కపోదు.

తెల్లవాని కాలంలో అది ఒక బందే ఖానా. ఇప్పుడు నల్లవాని యేలుబడిలో 'కాపురాల ఖానా'గా పేరు మార్చుకొని కామందు చాకమ్మకు కల్పవృక్షంలా నెల నెలా డబ్బులు రాల్చిపెడుతూంది.

మధ్య బయలు. బయల్లో చేదబావి. బావికి కొంచెం యెడంగా చుట్టూ గువ్వ గూళ్ళలాంటి గదులు. ఒకో గదిలో ఒకో కాపురం. అన్నీ కలిసి పదకొండు కాపురాలు. ఆడా మగా-పిల్లా పిసుకూ అంతా 'వెరశి యాభై మంది' చాకమ్మదేవిడీలో తలదాచుకుంటున్నారు, గొడుగంత గోవర్ధనగిరికింద మొత్తం గొల్లపల్లె ఒదిగినట్లుగా. వానాకాలంలో పిసపిస-ఎండాకాలంలో కసకస - చలికాలంలో గజగజ - ఒరుసుకుంటూ తప్పుకుంటూ శాపగ్రస్తుల్లా ఒద్దికగా కాపురాలు చేసుకుంటున్నాము.

కుడిచేతి ప్రక్క నాలుగో గది (గవి) లో నేనూ, సుభద్రా, పెద్దోడూ చిన్నోడూ, చంటిదీ వెరశి అయిదుమంది అయిదేండ్లుగా ఉంటున్నాము.

ఎండకాలం రాత్రుల్లో భోజనాలవుతూనే గబగబా గూళ్ళలోనుండి వెలికి వచ్చి బయల్లో బావిచుట్టూ పక్కలు వేసుకుని పడుకుంటాము.

ఆ రోజు రాత్రి తొమ్మిదయింది. ఉక్కబెడుతూంది. పేరుకుగూడా గాలి లేదు. సన్నాపన్నా గాలివున్నా, కాళ్ళీడ్చుకుంటూ సందులు దాటి ఆ గొందిలోనికి చొచ్చుకురాలేదు. చంటిదానికి అమ్మవారు పోసింది. గదిముందు వరండాలో ఉయ్యాల్లో పొర్లుతూంది. నేను చెయ్యి కడుక్కుంటూనే చాపా-దిండూ లేసికొని బావిదగ్గర బయల్లోకి వచ్చేశాను.

గుంట చుట్టూ కప్పలు చేరినట్లు అప్పటికే అక్కడ చాలామంది మగవారు బావి చుట్టూ తమ తమ తావుల్లో పక్కలు పరచుకొని ఉక్కకు విసురుకుంటూ చుట్టలూ, సిగిరెట్లూ ముట్టించుకొని బాతాఖానీ సాగిస్తున్నారు.

అక్కడ ఎవరి చోటు వారిదే. మరొకరు ఆక్రమించుకోరు. అయా కుటుంబాలవాళ్లు తమ తమ తావుల్లో అట్లా సర్దుకొని పడుకుంటారు.

అప్పటికే అక్కడ పడక వేసుకొని సిగిరెట్టు కాలుస్తూ కూర్చొనివున్న రామమూర్తి "రండి మాస్టారూ, భోజనాలయ్యాయా!" అంటూ ఆహ్వానించాడు. నన్ను చూసి.

"ఈ వేడికి అన్నం ఎక్కడ సయిస్తుందండీ, ఒకే దగగా వుంది. నీళ్లతోనే సగం కడుపు నిండిపోయింది," అంటూ వెళ్ళి రామ్మూర్తి ప్రక్కన కూరున్నాను.

రామమూర్తి సర్వే ఆఫీసులో పని చేస్తున్నాడు. ఈ వూరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకొనివచ్చి సుమారు నాలుగు నెలలయ్యాయి. ఇల్లు దొరకనందున

భార్యనూ బిడ్డనూ పల్లెలో బావమరిది దగ్గర వదిలి ఇక్కడ హోటలు కూడు తింటూ గృహాన్వేషణ సాగించాడు. కాలికి బలపం కట్టుకుని అదేపనిగా, వెతగ్గా వెతగ్గా కడకు చాకమ్మ దేవిడీలో గువ్వగూడంత చోటు దొరికింది. బ్రతికానురా దేవుడా అనుకున్నాడు. మరుదినమే పల్లెకు పరుగెత్తి వెళ్ళి భార్యా బిడ్డను తెచ్చుకున్నాడు. వారూ వచ్చి వారం రోజులే అయింది.

ఇద్దరం సిగరెట్లు కాలుస్తూ కూర్చున్నాం.

"ఎట్లావుంది ఇల్లు, కొంచెం ఇబ్బందిగా వుంటుందనుకుంటాను." అని మాట వరసకు పరామర్శించాను.

"ఊరూరూ తిరిగే ఉద్యోగులం సౌకర్యా లెక్కడికని? ఈ నాటికైనా ఇంత చోటు దొరికింది. ఇదే పదివేలు. నాకంటే మా ఆవిడ మహా సంతోషంగా వుందండీ. ఏదో అంతఃపురానికి వచ్చినట్లుగా ఆవిడ సంబరపడుతూంది. ఇన్నాళ్ళూ విధిలేక వాళ్ళ వదినెగారి దగ్గర వదిలి వచ్చానా, ఆమె వీర్ని పురుగును చూసినట్లు చూసిందట. చెట్టు కిందయినా ఇంత కూడు వండుకొని పడి వుంటాను. ఇక్కడ ఈసడింపులూ పొడుపులూ పడలేకుండా వున్నాను. అంటూ వారానికో ఉత్తరం వ్రాసిందంటే నమ్మండి. ఆ వదినెగారి నీడవదిలి ఇక్కడికి వచ్చినప్పటినుంచీ మా రుక్మిణి మహదానందంగా వుందండీ." అంటూ చెప్పుకొచ్చాడు రామమూర్తి.

అలా పిచ్చాపాటీ సాగిస్తూ చాలాసేపు గడిపాము. ఇళ్ళల్లో దీపాలన్నీ ఒకోటిగా ఆరిపోతూవచ్చాయి. ఆడవాళ్ళుగూడా సామాన్లు సర్ది - దీపాలు ఆర్పి - గదులకు గడెలు పెట్టి-బయల్లో తమతమ వాళ్ళున్న చోట్లకు వచ్చి 'ఇస్సో' మంటూ నడుములు వాల్చారు. పదిగంటలయినా గాలి పోలిక లేదు. చుట్టూ గోడల్లోంచి వెచ్చగ

సెగ తగుల్తూంది. చెమటకు ఒంటిమీద గుడ్డ అతుక్కుపోతూంది. మగవాళ్ళు బనీనులు ఆడవాళ్ళు రవికెలు పెరికి పారేసి విసనకర్రలు ఆడిస్తూ ఉపశమనం పొందుతున్నారు.

సుభద్ర గదిముందు వరండాలోనే ఉండిపోయింది. బయల్లోకి రాలేదు. ఉయ్యాల్లో ఉన్న చంటిదాన్ని కనిపెట్టుకొని గోడకు చేరగిలబడి కునుకు తీస్తూంది పాపం. నేనూ యెప్పుడు నేల బడదామా అనుకుంటున్నా.

"బలే ఉక్కగా వుంది మాష్టారూ, ఈ రాత్రికిక్కడ పడుకోవడం నా వల్ల కాదండి. వీధిలోకి వెళ్ళితే కొంచెం ఊపిరైనా ఆడుతుంది." అంటూ రామమూర్తి తన పక్కచుట్టుకొని దేవిడీగోడలు దాటి బైట వీధిలోకి వెళ్ళిపోయాడు.

నాకు నిద్ర ముంచుకొస్తూంది. కూచున్న చోటనే చాప దొర్లించి పడిపోయ్యాను. పడుకుందే తడవు కళ్లు మూతలుపడ్డాయి.

రాత్రి ఎంతయిందో తెలియదు. గాఢ నిద్రలో వున్నా. కొంచెం ప్రక్కకు పొర్లాను. నా ఒంటికి మరొక మెత్తని శరీరం రాసుకుంది. ఇంకెవరు? సుభద్ర వచ్చి పడుకొని వుంటుంది. ఆదమరిచి తృప్తిగా నిద్రపోతూంది-అనుకున్నా.

అప్పటికి పల్చగా మంచు పడనారంభించింది. కొద్దిగ చలి పెట్టినట్లు తోచింది. నిద్రమత్తులో కళ్ళుమూసుకునే తలగడ కిందవున్న శాలువ తీసి సగం సుభద్రకు కప్పి సగం నాపైకి లాక్కున్నా.

మగత నిద్రలో అంతవరకే తెలుసు నాకు.

* * *

మళ్ళీ కళ్ళు తెరిచి చూచేటప్పటికి భళ్ళున తెల్లవారిపోయింది. ఆడవాళ్ళు ఇళ్ళముందు కళ్ళాపి చల్లుతున్నారు. గబగబాలేచి చాపా-దిండూ చుట్టుకొని ఇంటిలోకి నడిచాను.

వరండాలో చంటిది ఉయ్యాల్లో నిద్రపోతూంది. ప్రక్కనే సుభద్ర నేలపై తెలివిలేకుండా పడివుంది. ఎడమచేతిలో పట్టుకున్న ఉయ్యాలతాడు పట్టుకున్నట్లే వుంది.

"ఏమిటీ మొద్దునిద్ర? లే, తెల్లారిపోయింది," అంటూ తట్టి లేపాను సుభద్రను. ఆమె బెదిరినట్లు చివుక్కున లేచింది. అయ్యో అంటూ బారెడెక్కిన ప్రొద్దుచూచి సిగ్గుపోయింది.

"చంటిది రాత్రంతా కన్ను మూయలేదు. నలుగుతూ, నసుగుతూ పొర్లుతూనే వుండింది. ఉయ్యాలతాడు వదిలుంచే ఒట్టు. నాలుగైంది నేనూ కన్ను మూసే టప్పటికి." అని పలుకుతూ సుభద్ర బద్ధకంగా ఇంటిలోకి వెళ్ళింది.

ఆ పలుకు తీరు నన్ను చక్కలిగింత బెట్టినట్లుగా తోచింది.

"అహా, ముదియ యెంత ముచ్చటగా బొంకుతూంది!" అని ఫక్కున నవ్వబోయాను. అంతలో టకీమని ఆగిపొయ్యాను.

బుర్రలో ఆలోచన అడ్డుపడింది.

వెంటనే నలుసంత నివ్వెరపాటు.

'మరి సుభద్ర చెపుతూంది నిజమా? అయితే.... అయితే.... రాత్రి నా ప్రక్కన పడుకుంది సుభద్ర కాదా?.... మరి.... మరి....'

అంతే, ఆపైన బుర్ర బొత్తిగా పని చెయ్యలేదు. ఆలోచనా-ఆశ్చర్యం-విచికిత్సా-మెదడు గోడల్ని గోకడానికి ఆరంభించాయి.

సంగతి సున్నితమైంది. అప్పటికి సుభద్రముందు మౌనంగా ఉండిపొయ్యాను.

* * *

ఆ పగలంతా పాఠశాల్లో అన్యమనస్కంగా గడిపాను.

సాయంత్రం బడినుండి ఇంటికి వస్తూనే—

"మన పక్కవాటాలో వున్న రుక్మిణమ్మ వెళ్ళిపోయిందండీ" అనింది సుభద్ర కాఫీ చేతికి అండిస్తూ.

"ఏ రుక్మిణమ్మ?" అలవోకగా ప్రశ్నించాను.

"రామ్మూర్తిగారి భార్యండీ. వచ్చి వారంరోజులు కూడా కాలేదు. ప్రొద్దున్నే బిడ్డను వెంటబెట్టుకొని పల్లెకు వెళ్ళిపోయింది."

"ఏదో పనివుండి వెళ్ళుంటారు? విశేషమేముంది?"

"అదిగాదండీ. చెప్పాచెయ్యకుండా చప్పున వెళ్ళిపోయింది. రుక్మిణమ్మ చాలా మంచిదండీ. ఈ నాల్గురోజులూ నా కెంతో సాయపడింది. బాగా కలుపుగోలు మనిషి. జబ్బుతోవున్న మన చంటిదాన్ని యెంత బాగా చూచిందని. పొద్దున్నే బస్సుకు వెళ్ళిపోయిందట.

అలాంటి సౌజన్యంగల పొరుగింటావిడ వెంటనే వెళ్ళిపోయినందుకు సుభద్ర నొచ్చుకుంటూ చెప్పింది.

సుభద్ర చెప్పింది విన్నాను. కొంత తెలుసుకున్నాను.

కాఫీ తాగి మౌనంగా బైటికి వచ్చాను.

రామమూర్తి ఆఫీసునుండి వస్తూ ఎదురుపడ్డాడు. మనిషి చికాగ్గా అగుపించాడు. నన్ను చూచి అన్నాడు-తనలో తాను వదురుకుంటున్నట్లు—

"ఈ ఆడవాళ్లు బలే చిత్రమయిన వాళ్లండి. వాళ్ల మనస్తత్వాలు అర్థమయి చావవు. మచ్చుకు చూడండి, మా ఆవిడ బుర్రలో ఉన్నట్లుండి యే పురుగు తొలిచిందో-'నేను ఈ సత్రంకొంపలో ఒక్క క్షణముండలేను. పల్లెకు పోతున్నా. వేరే ఇల్లు దొరికినప్పుడు జాబు వ్రాయండి, వెంటనే వస్తాను' అని చెప్పి ప్రొద్దున లేస్తూనే బిడ్డను చంకబెట్టుకొని వెళ్ళిపోయింది. నిన్నటివరకూ కులాసాగా వుంది. ఈ దినం ఇల్లు బాగాలేదని చక్కా వెళ్ళిపోయింది. ఈ ముదనష్టపు కొంపలో మరో యిల్లు నేను ఎక్కడ వెదికి చావను?" అంటూ వాపొయ్యాడు ఆయన నాముందు.

విన్నాను. మౌనంగా తప్పుకొని వెళ్ళిపోయాను.

* * *

ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. వెళ్ళి వీధి అరుగుమీద ఒంటరిగా కూర్చున్నా. వెళ్ళిపోయిన రుక్మిణమ్మను గురించిన ఆలోచన నన్ను వికలచిత్తుణ్ణి చేసింది.

రుక్మిణమ్మ తటాలున-ప్రొద్దున మరొకరికి ముఖం చూపించలేక వెళ్ళిపోయింది కారణం మనసుకు వచ్చి-తెలుసుకొని-మరీ క్రుంగిపోయాను.

అయినా ఈ రహస్యం ఎవరికి చెప్పను. ఎట్లా చెప్పగలను? సుభద్రకు చెప్పలేను. రామమూర్తికి చెప్పలేను. కడకు నేను సైతం మనసుకు తెచ్చుకోలేను. అది ఆ తల్లిపట్ల అపచారమే అవుతుంది. అప్రియమైన సంఘటన అలా అసంకల్పితంగా జరిగిపోయింది.

ఈ దుర్ఘటనకు నేను కారణమే కావచ్చు. కానీ నేనుగా యెరిగి యే దోషమూ చేయలేదు. ఇంతకూ నేను చేసిన తప్పు?

నిన్న రాత్రి రామమూర్తి మామూలుగా పడుకునేచోట బద్ధకించి నేను పడుకోవడమే. మరచి నిద్రపోవడమే.

రుక్మిణమ్మ ఇంటిపనులన్నీ ముగించి - పొద్దుపోయాక - అలసటతో వచ్చి మామూలుగా భర్త పక్కమీదికి వచ్చి మేనువాల్చి ఉంటుంది. ఆదమరిచి నిద్రపోయి వుంటుంది.

వేకువనే లేచినపుడు- నిజం తెలుసుకున్నపుడు - నిలువునా కూలిపోయి వుంటుంది.

మగనాలి మళ్ళీ మొహం చూపెట్టలేక ప్రొద్దున్నే ఇల్లు విడిచి వెళ్ళిపోయింది.

ఆమె ఇల్లాలు.

ఆ విధంగా మొగం దాచుకుంది.

యువ అక్టోబరు 1975 సంచిక నుంచి